క్లుప్తంగా

సంపత్ వేంకటేశ్వరుడికి నవమి పూజలు



వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: జ్యేష్ఠ మాసం నవమి సందర్భంగా శనివారం గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకులు శర్మ నేతృత్వంలో వెంకన్నకు సుప్రభాత సేవ, చక్ర స్నానం నిర్వహించారు. తెల్లవారుజాము 6 గంటలకు శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, కమిటీ సభ్యులు పంచామృతాభిషేకాలు, తులసీమాలార్చన, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో మెగా రక్తదాన శిబిరం



రక్తదాతకు జ్ఞాపిక అందిస్తున్న షిప్‌యార్డ్ అధికారులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ పరిశ్రమ ఆవరణలో లయన్స్ క్లబ్ సౌజన్యంతో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి సంస్థ డైరెక్టర్ ఫైనాన్స్, కమర్షియల్ ఎస్.వి.రాంబాబు శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం ఆవశ్యకతను వివరించారు. సుమారు 111 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రాణపాయ స్థితిలో ఉన్న మరో వ్యక్తిని కాపాడవచ్చునని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం రక్తదాతలను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్(ఎస్‌పీ) గిరిదీప్ సింగ్, షిప్‌యార్డ్ ప్రధాన వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, కంపెనీ సెక్రటరీ బేగ్, కోటేశ్వరరావు, డీజీఎం(హెచ్ఆర్), షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కారు బోల్తా



కాకానినగర్ వద్ద హైవేపై బోల్తా పడిన కారు

గోపాలపట్నం: కాకానినగర్ సమీప జాతీయ రహదారిపై గ్యాస్ ట్యాంకర్‌ను తప్పించబోయి ఓ కారు బోల్తా కొట్టిన ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలేనికి చెందిన బత్తుల చిరంజీవి శనివారం ఇంటి వద్ద నుంచి అనకాపల్లి వైపు బయలుదేరాడు. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దాటిన తరువాత కాకానినగర్ వద్ద ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేసే సమయంలో దాని బంపర్‌ను ఢీకొట్టడంతో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్న గాయాలతో చిరంజీవి బయటపడ్డాడు. సమాచారం అందుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బోల్తా పడిన కారును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనా స్థలంలో ప్రమాదానికి గల కారణాలను ఎయిర్‌పోర్ట్ పోలీసులు సేకరించి, కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్యాంకర్ డ్రైవర్, కారు డ్రైవర్ పరారయ్యారు.

నందనవనం

- డాబాపై ఆకుకూరలు, కూరగాయల మొక్కల పెంపకం
- ఆదర్శంగా నిలుస్తున్న రాజుయాదవ్



దానిమ్మ మొక్కకు అంటుకడుతున్న లొడగల రాజు



డాబాపై పారిజాతం, తెల్ల మల్లి పాదులు

మల్కాపురం: ఆ ఇంట్లోకి అడుగుపెడితే సువాసన.. ముఖద్వారం వద్దే పారిజాత పుష్పాలు స్వాగతం పలుకుతాయి. కాస్తా ముందుకు వెళ్తే తెల్లమల్లి గుభాళిస్తుంది. ఆ సువాసన పీల్చుతూ అలా ముందుకు కదిలితే నందన వనం కనిపిస్తుంది. వివిధ రకాల పండ్ల, పూల మొక్కలు కనువిందు చేస్తాయి. ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా గెంజి,పెరుగు,ఆవు పేడ వంటివి వినియోగించి సేంద్రియ పద్ధతిలో వందకు పైగా మొక్కలను ఆ వ్యక్తి పెంచుతున్నాడు.

పర్యావరణ ప్రేమికుడు

60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ ప్రాంతంలో లొడగల రాజుయాదవ్ అనే వ్యక్తి రెండు అంతస్తుల భవంతి కలిగి ఉన్నాడు.వృత్తి రీత్యా కేబుల్ వ్యాపారి అయిన రాజుకు చిన్నతనం నుంచి మొక్కలు పెంచడం ఒక హాబీ. తను ఉంటున్న మేడపై ఖాళీ ప్రదేశంలో పారిజాతం,తెల్లమల్లి పాదులతో పాటు గులాబీ,మందారం,బంతిపువ్వు వంటి పూల మొక్కలు నాటాడు. అలాగే కూరగాయల్లో బీర,దొండ,వంకాయ,టమాటా,నల్ల వంకాయ,బంగాళదుంప వంటి మొక్కలు పెంచుతున్నాడు. ద్రాక్ష,దానిమ్మ, నిమ్మ, జామి వంటి పండ్ల మొక్కలు, గోంగూర, పాలకూర, కొత్తిమీర, కరివేపాకు వంటి మొక్కలు నాటారు.

సేంద్రియ సాగు

ఈ మొక్కలకు ఎటువంటి రసాయనాలు రాజు వాడడు. కేవలం ఆవు గెత్తం,ఇంట్లో మిగిలిన పెరుగు,గెంజి,వేప నూనె మాత్రమే పిచికారీ చేస్తాడు. మొక్కలు పెంచడానికి తనకు పెద్ద ఖర్చు ఉండదని,వాటి పెంపకం వల్ల తమ కుటుంబానికి నెలకు సరిపడే ఆకుకూరలు,కూరగాయాలు,పండ్లు లభిస్తుంటాయని చెబుతున్నాడు. తన స్నేహితులకు కొన్ని ఇస్తుంటానని ఆయన చెబుతున్నాడు. ఇంటి డాబాను ఖాళీగా ఉంచకుండా మొక్కలు పెంచితే పచ్చదనంతో పాటు,కాలుష్య నియంత్రణకు దోహదపడుతుందని వివరించాడు. తన ఆరోగ్యకరమైన పంట లభించడంతో పాటు ఎంతో సంతృప్తి ఇస్తుందని రాజు చెబుతున్నాడు.



పలు రకాల పూల మొక్కలు

పార్కుల్లో సౌకర్యాలు కల్పించండి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: పార్కుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేలా తగిన చర్యలు చేపట్టాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్, ట్రైయాంగిల్ పార్కులను జీవీఎంసీ అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. పార్కుల్లో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతి, ఇంకా చేపట్టాల్సిన పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని రీతిలో పార్కులను అభివృద్ధి చేశామన్నారు. వీటిని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేలా అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పార్కులను సందర్శించే వారికి అసౌకర్యం కలుగకూడదన్నారు. పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం డీఈఈ ఏడుకొండలు, ఏఈ ఉష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

పాఠశాలల తనిఖీ

విశాఖ విద్య: గోపాలపట్నం మండల పరిధిలోని బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీల్లోని ప్రైవేటు స్కూళ్లను ఎంఈవో అంబటి సోమేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేటు స్కూళ్లలో తగిన వసతులు ఉన్నాయా లేదా అని పరిశీలన చేశారు. సుసర్లకాలనీలో డీఏవీ స్కూల్ నిర్వహణకు సంబంధించిన అనుమతి, గుర్తింపు పత్రాలను పాఠశాల యాజమాన్యం నుంచి సేకరించారు. విద్యాశాఖ పరంగా అన్ని అనుమతులు ఉంటేనే పాఠశాల నిర్వహించాలని ఆదేశించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



బిర్లా జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, సిబ్బంది

మర్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ నేతృత్వంలో సీఐ ప్రసాదరావు సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో కంచరపాలెం మెట్టు, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, హైవేలో బర్మాక్యాంప్, ఊర్వశి జంక్షన్, బిర్లా జంక్షన్ వద్ద బ్రీత్ అనలైజర్‌తో ప్రతి వాహన చోదకుడికి డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసేలా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నట్టు ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు తెలిపారు. పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన



ఉదయం ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా సర్వీస్ రోడ్డు



సాయంత్రం కురిసిన వర్షంలో తడుస్తూ బైక్‌పై ప్రయాణం

మల్కాపురం: ఉదయం అంతా తీవ్ర ఎండ, వేడి గాలులు, ఉక్కపోతతో అల్లాడిన పారిశ్రామిక ప్రాంత వాసులు.. సాయంత్రం ఉరుములతో కూడిన తేలిక పాటి వర్షంతో సేదతీరారు. పారిశ్రామిక ప్రాంతంలో శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఉదయం 9 గంటల నుండే తీవ్ర ఉక్కపోత, మధ్యాహ్నం వడగాడ్పులు వచ్చాయి. ఏంటీ పరిస్థితి అనుకుంటున్న పారిశ్రామిక ప్రాంత వాసులకు వరుణ దేవుడు కరుణించాడు. సాయంత్రం 5 గంటలకు కాసేపు వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

వర్షం.. హర్షం

- చల్లబడిన వాతావరణం
- పలు చోట్ల రోడ్డెక్కిన మురుగు, వర్షపు నీరు

గోపాలపట్నం: వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో గోపాలపట్నం పరిసర ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి ఎండకు ఉక్కపోతతో ఇబ్బందులకు గురైన జనానికి సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. వర్షానికి ముందుగా వీసిన ఈదురు గాలులు ఇబ్బందులకు గురి చేశాయి. గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద వినియోగంలో లేని సిగ్నల్ లైట్ స్తంభం పడి పోయింది. ఆ సమయంలో పాదచారులు ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. గోపాలపట్నం శ్మశాన వాటిక జంక్షన్‌లోని పెట్రోల్ బంక్ వద్ద మురుగు నీరు బీఆర్‌టీఎస్ రోడ్డుపై నిలిచి పోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. బీఆర్‌టీఎస్ డక్ట్‌లో చెత్త పేరుకు పోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

ఫ్లైఓవర్ నీరు జనం పైకి

ఎన్ఏడీ జంక్షన్ పై వంతెన నుంచి వచ్చే వర్షపునీరు ప్రయాణికులపై పడడంతో ఇబ్బందులు పడుతున్నారు. పై వంతెన నుంచి వచ్చే నీరు కిందకి వెళ్లేందుకు పైపులు ఏర్పాటు చేశారు. అయితే ఈ పైప్‌లు పాడవడంతో వర్షం నీరు వాహన చోదకులపై పడి ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి నూతన పైప్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



శ్మశానవాటిక జంక్షన్ వద్ద రోడ్డుపైకి చేరిన మురుగు నీరు



కారు వెళ్లడంతో విరజిమ్ముతున్న మురుగు నీరు



ఎన్ఏడీ జంక్షన్ దిగువ సర్కిల్‌లో వంతెన పైనుంచి పడుతున్న వర్షపు నీరు



గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

నేడు మరిడిమాంబ పండగ



మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగను మల్కాపురం విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆద్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. 1997లో హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థలో ఘోర విస్పోటనం జరగడంతో సంస్థలో పనిచేస్తున్న పలువురు మృతి చెందారు. సంస్థను ఆనుకుని అతి సమీపాన గల మల్కాపురంలో మాత్రం ఎటువంటి ఆస్తి నష్టం గానీ, ప్రాణ నష్టం గానీ జరగలేదు. అంతటి ఘోర ప్రమాదం నుంచి మల్కాపురం వాసులను గ్రామ దేవత మరిడిమాంబ కాపాడిందన్న విశ్వాసం ఈ ప్రాంత వాసుల్లో ఉంది. అందుకు కృతజ్ఞతగా 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా జూన్‌లో మల్కాపురంలో వివిధ కులాల వారు ఒక్కో వారం అమ్మవారి పండగను వారి సంఘ ప్రతినిధులు, సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకుని, అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఈ పండగకు కుటుంబ సభ్యులను, స్నేహితులను పిలుచుకుని, వారితో ఉమ్మడిగా వస్త్రాలు, పండ్లు పట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆదివారం ఈ ప్రాంత యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు తమ బంధువులతో అమ్మవారి పూజలు చేస్తారు. వచ్చే వారం మరో సామాజిక వర్గానికి చెందిన వారు, ఆపై వారం మరో వర్గం ఇలా ఒక్కొక్కరు చేస్తుంటారు.

ఆటోను ఢీ కొట్టిన కారు

ఆటో డ్రైవర్‌తోపాటు ప్రయాణికురాలికి గాయాలు

మల్కాపురం: ఓ కారు డ్రైవర్ మద్యం మత్తులో ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న మహిళకు గాయం అయింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. గాజువాక ప్రాంతానికి చెందిన గొలగాని అప్పలరాజుయాదవ్ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని శనివారం ఉదయం గాజువాక నుంచి సింధియా వైపు వస్తున్నాడు. మార్గ మధ్యంలో మల్కాపురం వద్ద ఆటోను వెనుక నుంచి కారు డ్రైవర్ ఆటోను వెనుక బలంగా ఢీ కొట్టాడు. దీంతో ఆటో డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఆటో నడుపుతున్న యూనియన్ అధ్యక్షుడు గొలగాని అప్పలరాజుయాదవ్‌తో పాటు ప్రయాణిస్తున్న మహిళకు కంటిపై గాయం అయింది. మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ వివరాలు సేకరించారు. కారు డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని వివరించారు.



ప్రమాదంలో నుజ్జయిన ఆటో ముందు భాగం

గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

పరిశీలించిన ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులు



శ్రీరామ్‌నగర్‌లోని గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు



గెడ్డ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో గెడ్డ ఉంది.ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు, వ్యర్థాలు ఈ గెడ్డ ద్వారా గెడ్డకు సమీపంలో ఐఎన్ఎస్ ఏకశిల రక్షణ గోడ దిగువ నుంచి సముద్రంలో కలుస్తుంది. ఇక్కడ రక్షణ గోడ దిగువ నుంచి వ్యర్థాలు వెళ్లకుండా అడ్డంగా ఇనుప జాలీని అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పుడు నేవల్ అధికారులు చిన్నపాటి పైపు వేశారు.అయితే ఈ పైపు ద్వారా మురుగు నీరు వేగంగా వెళ్లకపోవడం, దీనికి తోడు భారీగా వ్యర్థాలు పేరుకుపోవడం వంటి సమస్య ఎదురవుతుంది.

స్పందించిన అధికారులు

జీవీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులు శనివారం సాయంత్రం ఆ ప్రాంతంలో పర్యటించారు. వర్క్స్ డీఈ ఏడుకొండలు తన సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి సమస్యను గుర్తించారు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు



ఆర్చరీ క్రీడాకారులతో సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జిల్లా ఆర్చరీ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు ముగిశాయి. జిల్లా ఆర్చరీ సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రికర్వు, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24 వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారికి జిల్లా ఆర్చరీ సంఘ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, పాఠశాల సీఈవో కె.నిశాంత్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు ..

అండర్–10 విభాగంలో: ఎస్.వి.శరత్, పి.ఠాగూర్, బి.విరాజ్, ఎల్.సాత్విక్, ఎన్.శశికాంత్.

అండర్ –13 విభాగంలో : కె.నందిత, వి.ఆద్య, వి.కీర్తి, వి.లలితసాయి, ఎస్.తేజేశ్వర్‌రావు, కె.ఆశ్రీత్, ఎస్.తన్మయ్, వి.యశస్వి.

అండర్–15 విభాగంలో: బి.మణిత్, నభ్యప్రభాత్, ఎస్.రామచైతన్య, బి.వైష్ణవి, కె.సాయి మనస్వి, పి.హర్షిత, పి.హరియాణ.

నేవల్ డాక్‌యార్డ్‌లో ముగిసిన విద్యార్థుల ఇంటర్న్‌షిప్



ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న యూనివర్సిటీల విద్యార్థులతో నేవీ ఉన్నతాధికారులు

సింధియా: విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం యూనివర్సిటీ విద్యార్థులకు మే 15 నుంచి ఈ నెల 14 వరకు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తూ మెరైన్ ప్రొపల్షన్, పవర్ జనరేషన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, యాక్సిలరీ డెక్ మెషినరీ ఆన్‌బోర్డ్ వార్‌షిప్‌లకు సంబంధించిన నిర్వహణ వంటి కార్యకలాపాలపై నాలుగు వారాల పాటు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కమాండర్ సంజయ్‌కుమార్ (హెచ్ఆర్) మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. మేక్ ఇన్ ఇండియా నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ జరిగిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమం భవిష్యత్తులో నిపుణులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా జరిగిందని, విద్యార్థుల ఆచరణాత్మక జ్ఞానం, పరిశ్రమల అవసరాలను తగ్గించేందుకు అవసరముంటుందని భావిస్తున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి.



నౌకల విడిభాగాల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న నేవీ సిబ్బంది

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం , యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.